బ్రహ్మోత్సవాలకు వేళాయె..


సీతారాముల కల్యాణానికి ముస్తాబవుతున్న రామాలయం


సీతారాముల ఉత్సవ మూర్తులు (ఫైల్)

- 6న శ్రీరామనవమి, 15న పెద్ద రథోత్సవం
- ముస్తాబైన రామాలయం
- తరలిరానున్న భక్తులు
- 14 రోజుల పాటు కొనసాగనున్న సందడి
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా నేటి నుంచి ఈనెల 15 వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. శ్రీరామనవమిని పురస్కరించుకుని కమలాపూర్‌లో శ్రీసీతారాముల కల్యాణం మొదలుకుని 14 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య అర్చకులు సత్యనారాయణాచార్యులు, సీతారామాచార్యులు, వెంకటాచార్యులు, ఆదిత్యతేజ రాఘవాచార్యులు, మణికంఠ భిక్షమాచార్యులు తెలిపారు. ఈనెల 6న సీతారాముల కల్యాణంతో పాటు ప్రతి రోజు స్వామి వారిని రోజుకో రూపంలో అలంకరించి రాత్రి చిన్నరథంపై, 15వ తేదీన ఉదయం నుంచి రాత్రి వరకు సీతారాములను పెద్ద రథంపై పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 6న సీతారాముల కల్యాణానికి, 11న బండ్ల జాతరకు, 15న పెద్ద రథోత్సవానికి కమలాపూర్‌తో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

14 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు..

శ్రీరామనవమిని పురస్కరించుకుని కమలాపూర్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేటి నుంచి 4 వరకు అధ్యయనోత్సవాలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 5న ఉదయం సీతారాములను వధూ, వరులుగా తయారు చేసి, సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగనున్నట్లు తెలిపారు. 6న ఉదయం నిత్యార్చన, హోమం, బలిహరణం, సాయంత్రం స్వామివారి ఎదుర్కోళ్లు, రాత్రి సీతారాముల కల్యాణం (తలంబ్రాలు) ఉంటుందని చెప్పారు. 7న హనుమంత వాహన సేవ, 8న గరుడ వాహన సేవ, 9న సింహ వాహన సేవ, 10న అలుక ఉత్సవం, శేష వాహన సేవ, 11న హంస వాహన సేవ (బండ్లు తిరుగుట), 12న గజ వాహన సేవ, 13న కల్పవృక్ష వాహన సేవ, 14న ఉదయం దోపోత్సవం, సాయంత్రం అశ్వ వాహన సేవ, 15న ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద రథోత్సవం, అనంతరం వసంతోత్సవం, పుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

ఆలయ కమిటీ ఎన్నిక



వేలేరు : మల్లికుదుర్ల గ్రామంలోని సీతారామాంజనేయ ఆలయ కమిటీని వ్యవస్థాపకుడు రమేశ్ గురూజీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పల్లె రవీందర్ రెడ్డి, అధ్యక్షుడిగా మహేందర్, ఉపాధ్యక్షులుగా మల్లారెడ్డి, వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా పన్నీరు రాజశేఖర్, కోశాధికారిగా రామస్వామి, సహాయ కార్యదర్శులుగా మండల రాజు, కుంట రాజయ్య, సభ్యులుగా మధుసూధన్‌రెడ్డి, కుమారస్వామి, బచ్చు చంద్రయ్య, సంపత్, రంజిత్‌ను ఎన్నుకున్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం



శాయంపేట : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాలుగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన కానిస్టేబుల్ రంజిత్‌కుమార్ ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రంజిత్ కుమార్‌ను శాయంపేట సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్సై అశోక్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

తేజస్వినిరెడ్డికి సన్మానం



గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 4వ ర్యాంక్ సాధించిన మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన జిన్నా తేజస్విని రెడ్డిని మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు మంగళవారం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. శ్రీనివాసారావు, చొక్కారావు, రాజు ఉన్నారు.

మోదీ ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలి



ఆత్మకూరు : పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను రేషన్ షాపుల వద్ద ఏర్పాటు చేసే విధంగా అధికారులు చొరవ చూపాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పెంచికలపేటలో రేషన్ షాపు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మోదీ ఫొటో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా ప్రతిఒక్కరికీ ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందిస్తున్న ఘనత పీఎం మోదీదేనన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సముద్రాల రవి, నాయకులు అల్లె మహేందర్ పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ హత్యలను ఖండించాలి



నర్సంపేట: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివాసులపై జరుగుతున్న హింస, దౌర్జన్యాలు, ఎన్‌కౌంటర్ల పేరుతో జరుగుతున్న హత్యలను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నా యకులు దయాకర్, ఎలకంటి రాజేందర్‌లు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కి వ్యతిరేకంగా ఏప్రిల్ 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ప్రజా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో సహజ సిద్ధంగా ఏర్పడ్డ ప్రకృతి సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టేందుకే ఆదివాసులను అవసరమైతే బలవంతంగా ఖాళీ చేయిస్తుందన్నారు. ధర్నాకు మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కృష్ణ, సారంగపాణి, సాంబయ్య, వీరస్వామి, కొముర‌య్య, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి, రంజిత్, అశోక్, క్రాంతికుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క, సౌందర్య, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అజయ్, చందు, మదనన్న, కె.రాజేశ్వరి, లింగయ్య, పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి


సఖి సెంటర్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

శాయంపేట : మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దకోడెపాకలో వీఓ కమ్యూనిటీ హాల్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. సఖి సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ సహాయం, వైద్య, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. గృహహింస, లైగింక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాల వంటి వేధింపులపై రక్షణ పొందడానికి సఖి సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని అన్నారు. బాధిత మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. 181 మహిళా హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా తక్షణ సాయం, రక్షణ కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం సఖి సెంటర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేస్ వర్కర్ అనూష, సీసీ ప్రభాకర్, వీఓఏ విజయ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం పంపిణీ


కమలాపూర్ : సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రణవ్


ఎల్కతుర్తిలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్

కమలాపూర్ : పేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ పథకాన్ని స్థానిక ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్‌తో కలిసి మంగళవారం ఆయన కమలాపూర్, కానిపర్తి, శంభునిపల్లి, పంగిడిపల్లి గ్రామాల్లో ప్రారంభించి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 17,263 రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్న లబ్ధిదారులందరికీ ఏప్రిల్ 1 నుంచి ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2,300 కోట్ల భారం పడుతోందని, అయినా సన్నబియ్యం పథకాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు సన్న వడ్లు పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తూ రాష్ట్రంలోని రైతులకు, వ్యవసాయానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. తెలంగాణలో పండించిన బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామన్నారు. అనంతరం స్థానిక రామాలయంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్‌గౌడ్, చరణ్‌పటేల్, శ్రీనివాసరావు, రాజిరెడ్డి, డాక్టర్ కుమారస్వామి, కనుకరత్నం, భిక్షపతి, వంశీధర్‌రావు, రమేశ్, శ్రీకాంత్, అశోక్, రవి, పర్శరాములు, ఏఎంసీ డైరెక్టర్లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, చిట్టంపల్లి అయిలయ్య అన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని రేషన్ షాపుల్లో ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పీడీఎస్ ద్వారా సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యానికి బదులుగా సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గొర్వకారణమన్నారు. పేదలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేనప్పటికీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొకటిగా నెరవేరుస్తుందన్నారు. అనంతరం ఎలక్తుర్తి తహసీల్దార్ జగత్‌సింగ్ స్థానిక రేషన్ షాపులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, రాజు, అశోక్‌ముఖర్జీ, ప్రకాశ్, ఎగ్రా, సుదర్శన్‌రెడ్డి, సరోజన నాయకులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి బంగారం బహూకరణ


స్వామివారికి బంగారం బహూకరిస్తున్న కుమారస్వామి

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టు మల్లికార్జునస్వామికి వంగ కుమారస్వామి అనే భక్తుడు అరతులం బంగారం బహూకరించినట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుమారస్వామి కోరిన కోరిక నేరవేరడంతో మొక్కుబడిగా మహాశివరాత్రి సందర్భంగా అరతులం బంగారు కోరమీసాలను హుండీలో వేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. గత నెల 28వ తేదీన దేవాదాయ ధర్మదాయ డివిజన్ పరిశీలకుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీలను లెక్కిస్తున్న క్రమంలో సదరు భక్తుడు వేసిన కోరమీసాలను పరిశీలించగా అది వెండి కోరమీసంపై బంగారు రంగుపూత పూసినట్లుగా గుర్తించి సదరు భక్తుడికి సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో సదరు భక్తుడు తాను వరంగల్‌లో కొనుగోలు చేసిన షాప్ యాజమానిని నిలదీయడంతో తప్పు ఒప్పుకుని అసలైన బంగారం ఇచ్చినట్లు పేర్కొన్నాడు. దీంతో మంగళవారం ఆలయ అర్చకులు మహేశ్, ఒగ్గు కళాకారుడు కొలను రాజు ఆధ్వర్యంలో తిరిగి ఆలయానికి అరతులం బంగారం బహూకరించినట్లు తెలిపారు.

గంగమ్మతల్లికి పూజలు

నల్లబెల్లి: మండల కేంద్రంలో యాదవ కాలనీలో యాదవ కులస్తుల కులదైవం గంగమ్మ తల్లి, మల్లన్న దేవలతకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కులపెద్ద బత్తిని ఒదేలు ఇంట్లో కడెం యాకుమల్లు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేయగా ఒదేలు కుటుంబ సభ్యులు బోనాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మందహెచ్చుల కళాకారులు కథ చెప్పారు.

కొండపర్తిలో చోరీ

ఐనవోలు : కొండపర్తి గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగ్గిల్ల శివయ్య మార్చి 31న ఇంటికి తాళం వేసి స్వంత పనిపై సోమిడి గ్రామానికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకున్నాడు. కాగా ఇంటి తాళం ధ్వంసమై ఉడడం, తలుపులు తెరిచి ఉడడంతో గమణించిన అతడు పోలీస్‌లకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు ఎస్సై తెలిపారు. కాగా బీరువాలో నగదు రూ.25వేలు, 2 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంబర్ ప్యాకెట్ల స్వాధీనం



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో గల దుకాణాల్లో విక్రయిస్తున్న అంబర్ ప్యాకెట్లను పట్టుకున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు. నీరుకుళ్ల గ్రామంలోని బిట్ల ప్రదీప్ షాపులో రూ.3,270 విలువచేసే అంబర్ ప్యాకెట్లను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రదీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

పవర్ స్ప్రేయర్ పంపిణీ



కమలాపూర్ : మండలంలోని గూనిపర్తి గ్రామంలో గల నిరుపేద రైతులకు భారత వికాస్ పరిషత్ (బీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీవీపీ ఉపాధ్యక్షుడు చంచల్ అగర్వాల్ మాట్లాడుతూ.. భారత వికాస్ పరిషత్ నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాల్లో పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేయడం ముఖ్యమైందన్నారు. అదామ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో బీవీపీ రాష్ట్ర శాఖ అందజేసిన పది పవర్ స్ప్రేయర్లలో ఏడు గీసుగొండ మండల రైతులకు, రెండు దామెర మండల రైతులకు, ఒకటి గూనిపర్తి రైతులకు అందజేసినట్లు తెలిపారు. బీవీపీ కార్యదర్శి సత్యనారాయణ, బాధ్యులు దామోదర్, భక్తాంజనేయ భజన మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు చెల్లించాలి

సంగెం : ఉపాధిహామీ కూలీలకు వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలని ఎంసీపీఐయూ మండల కార్యదర్శి ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తీగరాజుపల్లి, గవిచర్ల, గాంధీనగర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీల సమస్యలను తెలుసుకున్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



ఆత్మకూరు : సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. సన్న బియ్యం పంపిణీ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు వాసు, రవి, జైపాల్‌రెడ్డి, కుమారస్వామి, కిరీటి, సందీప్, ఖాజా పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసాన్ని వినియోగించుకోవాలి

- ఎంపీడీఓలు వీరేశం, బాబు


కమలాపూర్ : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రం

ఎల్కతుర్తి : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన రాజీవ్ యువవికాస పథకాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని ఎంపీడీఓ వీరేశం సూచించారు. ఈ మేరకు మంగళవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువవికాస పథకానికి దరఖాస్తులు స్వీకరించేందుకు సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఏప్రిల్ 14వరకు గడువు పొడగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, ఈబీసీ, మైనార్టీ యువత వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకానికి ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 731 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రింట్ కాపీలతో పాటు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, పాన్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయక కేంద్రంలో సమర్పించాలని, ఈ పథకంపై పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : రాజీవ్ యువవికాసం దరఖాస్తుల స్వీకరణకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ గుండె బాబు మంగళవారం తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గాలకు చెందిన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జత చేసి పూరించిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తు ఫారాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రంలో నేరుగా అందజేయవచ్చన్నారు. అదే విధంగా మీ సేవ, ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు తమ ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాన్ని అందజేయవచ్చన్నారు. ఇప్పటి నుంచి మీ సేవ, ఆన్‌లైన్ కేంద్రాలతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ యువవికాసం సేవా కేంద్రంలోనూ రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

సీతారాముల కల్యాణానికి రండి..


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో గల ముఖ్యనాథస్వామి దేవాలయంలో ఈనెల 06న శ్రీరామ నవమి సందర్భంగా మొదటిసారిగా నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, స్థానిక సీఐ ప్రవీణ్ కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించి కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. మాజీ సర్పంచ్‌లు సమ్మక్క రాజయ్య, కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, కొరిమి సతీశ్, గోనెల మల్లయ్య, ఆలయ కమిటీ చైర్మన్ శివసాని ప్రవీణ్, ఉపాధ్యక్షులు గుంటిపల్లి సంపత్ కుమార్, కోరుకొప్పుల అనిల్ కుమార్, సభ్యులు మేకల శ్రీకాంత్, గూల్ల కొమురయ్య, ధర్మకర్తలు మద్రిపల్లి వెంకటస్వామి, ఎర్ర చేరాలు, కందుకూరి రమేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


35 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1990–91 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గూడూరు శివారులోని సాధన రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా 35 ఏళ్ల తర్వాత తమతో చదువుకున్న బాల్య మిత్రులను కలిసి ఆప్యాయంగా పలకరించుకుని కుశల ప్రశ్నలు, యోగ, క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి బాల్య స్మృతులను, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. 35 ఏళ్ల తర్వాత తామందరిని ఒక్కచోటకు చేర్చిన నిర్వాహకులకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాలసాని దేవేందర్, నద్దునూరి భద్రయ్య, మార్క వెంకటేశ్వర్లు, చేరాల రమేశ్, తౌటం శ్రీనివాస్, పిల్లల విద్యాసాగర్, సాగర్, పుల్ల సమ్మయ్య, పుల్ల ఏలియా, మాట్ల పున్నం, మార్క అశోక్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాతో యువతకు ఉపాధి


ముస్త్యాలపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

దామెర : జాబ్ మేళా ద్వారా యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. మండలంలోని ముస్త్యాపల్లిలో నిరుద్యోగ యువతతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 4వ తేదీన పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమయం వృథా చేయకుండా యువత వివిధ రకాల కంపెనీలో ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు, కుటుంబానికి చెదోడుగా ఉండాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువతి, యువకులు, నాయకులు దండు విజేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


సాయిలు

ఐనవోలు : వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని పున్నేలు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందుల సాయిలు(60) మార్చి 28 రాత్రి నుంచి కుటుంబ సభ్యులకు కనిపించలేదు. బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి కుమారుడు రాజ్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి 5 ఫీట్ల 2 అంగులాల పొడవు, చామనఛాయ రంగు, తెల్లరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉంటాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఐనవోలు పోలీస్ స్టేషన్ 8712685244, 8712685030 నంబర్లకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ సూచించారు.

IN THE COURT OF HON'BLE SHRI S.A. SARDAR CIVIL JUDGE SENIOR DIVISION, SAONER, TAH.SAONER, DIST.NAGPUR
NOTICE TO SHOW CAUSE, (GENERAL FORM)
H.M.P. 96/2024 NEXT DATE: 22-04-2025
Poonam ---V--- Jayanth
To,
Jayanth Kumar Rayapa Rajarpu, R/o. Village Damera, S.C. Colony, Mandal Elkathurthy, Dist. Hanamkonda Rural, State Telangana, Pin Code 505476, Mob. No. 7075657997
Whereas in the above named has made application to this Court that you are hereby warned to appear in this court in person or by a Pleader duly instructed on the 22-04-2025 at 11.00 O' Clock in the forenoon, to show cause against the application, failing wherein, the said application will be heard and determined ex parte.
Given under my hand and the seal of the Court, this DT. 20/03/2025
Sd/- ASST. SUPERINTENDENT
Civil Judge Sr. Dn. Saoner